RNI NO:APTEL /2023/90201

# రాజధాని వాయిస్

తెలుగు దినపత్రిక

web : www.rajadhanivoice.in rajadhanivoicedaily@gmail.com

విలేఖరులు కావలెను
రాజధాని వాయిస్ తెలుగు దినపత్రికలో కొనసాగుటకు
గుంటూరు,పల్నాడు,జిల్లాలలో స్టాఫర్లు
నియోజకవర్గాలకు ఇంచార్జులు మరియు
మండలాల వారీగా విలేఖరులు కావలెను
ఆసక్తి గలవారు సంప్రదించగలరు.
9030343195
అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును

సంపుటి : 02 | సంచిక : 332 | 23 శుక్రవారం అక్టోబరు 2026 | ఎడిటర్ : పాగళ్ల పూర్ణచంద్రరావు | పేజీలు : 4 | వెల : రూ.1/-

# పట్టణ స్థానిక సంస్థలకు 1న పోలింగ్

**అమరావతి, రాజధాని వాయిస్ :** సుప్రీంకోర్టు ఆదేశాలతో రాష్ట్రంలో కార్పొరేషన్లు, మున్సిపాల్టీల ఎన్నికల షెడ్యూల్‌లో కీలక మార్పు చోటుచేసుకుంది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పట్టణ స్థానిక సంస్థల్లో నవంబర్ ఒకటవ తేదిన పోలింగ్ నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ణయించింది. ఈ మేరకు సవరించిన ఎన్నికల షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా గురువారం రాత్రి విడుదల చేశారు. రాష్ట్రంలోని 100 పట్టణ స్థానిక సంస్థలకు నవంబర్ ఒకటవ తేదిన పోలింగ్ నిర్వహించనున్నట్లు, రీ పోలింగ్ అవసరమైతే 2వ తేది జరిపి, మూడవ తేది ఓట్ల లెక్కింపు నిర్వహించనున్నట్లు తాజాగా విడుదల చేసిన షెడ్యూల్‌లో పేర్కొన్నారు. శాంతి భద్రతల సమస్యలు తలెత్తిన కారణంగా నామినేషన్లు దాఖలు చేయలేక పోయిన అభ్యర్థులకు మరో అవకాశం ఇవ్వాలన్న సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు నాలుగు పట్టణ స్థానిక సంస్థల్లో నామినేషన్ల దాఖలుకు గడువు పొడిగించారు. వైఎస్ఆర్ కడప జిల్లాలో కడప మున్సిపల్ కార్పొరేషన్, రాజంపేట మున్సిపాలిటీ లలో కొన్ని వార్డులకు మైదుకూరు మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లోనూ నామినేషన్ల దాఖలుకు మరోసారి అవకాశం కల్పించారు. తిరుపతి జిల్లాలోని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌లో కూడా కొన్ని వార్డులలో నామినేషన్ల గడువు పొడిగించారు.ఇక్కడ ఈ నెల 23, 24 తేదీల్లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. ఇప్పటికే ప్రకటించిన నామినేషన్ కేంద్రాలతో పాటు, సంబంధిత కలెక్టర్ కార్యాలయాల్లో కూడా నామినేషన్లు స్వీకరించను న్నారు. . 'కలెక్టర్ కార్యాలయంలో గానీ, లేదా జిల్లా ఎన్నికల అధికారి సూచించిన కలెక్టరేట్ ప్రాంగణం లోని ప్రత్యేకం ప్రాంతాల్లోగాని నామినేషన్లు స్వీకరించవచ్చు' అని షెడ్యూల్ లో తెలిపారు.బరిలో ఉన్న అభ్యర్థుల జాబితా 25న రాష్ట్రమంతా పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థుల తుది జాబితాను ఈ నెల 25వ తేది ప్రచురించనున్నారు. పొడిగించిన గడువులో కొత్తగా దాఖలైన నామినేషన్లను అక్టోబర్ 25న ఉదయం 8 గంటల నుంచి పరిశీలిస్తారు. కొత్తగా నామినేషన్లు దాకలు చేసిన అభ్యర్థులకు మాత్రమే అదే రోజు మధ్యాహ్నం 3 గంటల వరకు అభ్యర్థిత్వాన్ని ఉపసంహరించుకునే అవకాశం ఉంటుంది.ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత అక్టోబర్ 25న మధ్యాహ్నం 3 గంటల తర్వాత పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితాను ప్రచురిస్తారు. రాష్ట్రంలోని మొత్తం 100 పట్టణ స్థానిక సంస్థల బరిలో నిలిచిన అభ్యర్థుల జాబితాను అదే రోజు ప్రకటిస్తామని షెడ్యూల్‌లో తెలిపారు.

**సుదీర్ఘ కసరత్తు**

శాంతి భద్రతల సమస్యల కారణంగా అనేక చోట్ల నామినేషన్లు దాఖలు చేయలేకపోయామంటూ వైసిపితో పాటు పలువురు అభ్యర్థులు దాఖలు చేసిన పిటిషన్లను విచారించిన సుప్రీంకోర్టు ఎన్నికల ప్రక్రియను నిలిపివేయాలంటూ ఆదేశించిన సంగతి తెలిసిందే. సుప్రీం ఆదేశాల ప్రకారం జిల్లా కలెక్టర్లు, ఎస్‌పిల నుండి అందిన నివేదికలను రాష్ట్ర ఎన్నికల అధికారులు



పరిశీలించారు. బుధవారం రాత్రి నుండే ఈ కసరతుత ప్రారంభించారు.ఒకవైపు సుప్రీంతీర్పును అధ్యయనం చేస్తూ, మరోవైపు జిల్లాల నుండి వచ్చిన నివేదికలను పరిశీలించే ప్రక్రియను అధికారులు నిర్వహించారు. గురువారం లోగా ఈ ప్రక్రియను పూర్తి చేసి నామినేషన్ల గడువు పొడిగింపు పై నిర్ణయం తీసుకోవాలని అత్యున్నత న్యాయస్థానం ఆదేశించడంతో ఆ మేరకు గురువారం రాత్రి పది గంటల ప్రాంతంలో తాజా షెడ్యూల్‌ను విడుదల చేశారు. గడువు పొడిగిస్తే నామినేషన్ల దాఖలుకు కనీసం 48 గంటల సమయం ఇవ్వాలని సుప్రీంకోర్టు ఆదేశించిన నేపథ్యంలో నేడు, రేపు (శుక్ర,శని వారాల్లో) ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరించాలని నిర్ణయించారు.

## విజయసాయి రెడ్డిని కలిసిన వైఎస్ షర్మిల.. భేటీ వెనుక రాజకీయ చర్చ



**అమరావతి,రాజధాని వాయిస్ :** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఒకప్పుడు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో కీలక పాత్ర పోషించి, ప్రస్తుతం మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి రాజకీయంగా దూరమైన ఇద్దరు ముఖ్య నేతల భేటీ తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, ఇటీవల వైసీపీని వీడిన మాజీ ఎంపీ విజయసాయి రెడ్డి నివాసానికి వెళ్లి ఆయనతో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. బుధవారం జరిగిన ఈ భేటీ పైకి కుటుంబ వేడుక ఆహ్వానమే అయినప్పటికీ, రాష్ట్రంలో మారుతున్న రాజకీయ సమీకరణాల నేపథ్యంలో ప్రత్యేక ప్రాధాన్యతను సంతరించుకుంది.తన కుమార్తె అంజలి వివాహ ఆహ్వాన పత్రికను విజయసాయి రెడ్డికి స్వయంగా అందజేసిన వైఎస్ షర్మిల, కుటుంబసమేతంగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించాలని కోరారు. ఈ సందర్భంగా ఇద్దరి మధ్య కాసేపు స్నేహపూర్వక వాతావరణంలో సంభాషణ సాగింది. అయితే, విజయసాయి రెడ్డి వైసీపీ నుంచి బయటకు వచ్చిన తర్వాత జగన్‌మోహన్ రెడ్డి వైఖరిపై, పార్టీ నిర్ణయాలపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పిస్తున్న విషయం తెలిసిందే. అంతేకాకుండా, అసలైన రెడ్డి సామాజికవర్గానికి సరైన ప్రాధాన్యత దక్కలేదని ఆరోపిస్తూ త్వరలోనే కొత్త రాజకీయ పార్టీ పెట్టబోతున్నట్లు ఆయన ప్రకటించారు. మరోవైపు షర్మిల కూడా మొదటి నుంచీ జగన్ విధానాలపై ఘాటు వ్యాఖ్యలు చేస్తూ వస్తున్నారు.ఈ నేపథ్యంలో జగన్‌పై అసంతృప్తితో ఉన్న ఈ ఇద్దరు నేతలు ఒకేచోట కలవడం రాజకీయ వర్గాల్లో కొత్త ఊహాగానాలకు తావిచ్చింది. కాగా, షర్మిల రాకపై విజయసాయి రెడ్డి సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ ఆత్మీయ పోస్ట్ చేశారు.

# వైఎస్సార్‌సీపీలోకి గుండ లక్ష్మీదేవి

**జగన్ సమక్షంలో పార్టీలో చేరిన శ్రీకాకుళం మాజీ ఎమ్మెల్యే**
**నలభై ఏళ్ల తెదేపా రాజకీయ అనుబంధానికి ముగింపు**
**ముఖ్య అనుచరులతో కలిసి వైకాపాలో చేరిక**
**కండువాలు కప్పి ఆహ్వానించిన వైఎస్ జగన్**



**తాడేపల్లి, రాజధాని వాయిస్ :** శ్రీకాకుళం మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో గురువారం వైకాపా అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో ఆమె తన ముఖ్య అనుచరులతో కలిసి పార్టీలోకి వచ్చారు. ఈ సందర్భంగా జగన్ వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. గుండ లక్ష్మీదేవి చేరికతో శ్రీకాకుళం జిల్లాలో రాజకీయంగా ఈ పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది. సుదీర్ఘకాలంగా తెలుగుదేశం పార్టీతో అనుబంధం కలిగిన కుటుంబం నుంచి ఆమె వైకాపాలో చేరడం చర్చనీయాంశమైంది. ఈ కార్యక్రమానికి పార్టీకి చెందిన పలువురు నాయకులు హాజరై కొత్తగా చేరిన నేతలకు స్వాగతం పలికారు. గుండ లక్ష్మీదేవి కుటుంబానికి తెలుగుదేశం పార్టీతో దాదాపు నాలుగు దశాబ్దాల రాజకీయ అనుబంధం ఉంది. ఆమె భర్త, దివంగత మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ నాలుగు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికవడంతోపాటు రెండుసార్లు మంత్రిగా పనిచేశారు. శ్రీకాకుళం రాజకీయాల్లో ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉంది. కుటుంబ రాజకీయ వారసత్వాన్ని కొనసాగిస్తూ గుండ లక్ష్మీదేవి 2014 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ తరఫున శ్రీకాకుళం శాసనసభ నియోజకవర్గం నుంచి పోటీ చేసి విజయం సాధించారు. ఇంతకాలం తెదేపాతో అనుబంధం కొనసాగించిన ఆమె ఇప్పుడు వైకాపాలో చేరడం జిల్లాలోని రాజకీయ సమీకరణాలపై ఎలాంటి ప్రభావం చూపుతుందన్న అంశంపై చర్చ జరుగుతోంది.గుండ లక్ష్మీదేవితోపాటు పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు కూడా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ముద్దాడ ప్రవీణ్, జల్లు రాజీవ్, సిమ్మ నర్సింగరావు, పల్లి శ్రీనివాసరావు, కునుకు గోవింద్, గాడు సాయికుమార్, గేదెల రాంకుమార్, యాగాటి ప్రసాద్, చిన్నాల ముత్తయి నాయుడు, చెట్టు గోవింద్, గురువు శ్రీనివాస్, రౌతు నాగేశ్వరరావు తదితరులు పార్టీ కండువాలు కప్పుకున్నారు. మాజీ ఎమ్మెల్యేతోపాటు ఆమెకు మద్దతుగా ఉన్న నాయకులు ఒకేసారి పార్టీ మారడం శ్రీకాకుళం జిల్లా రాజకీయాల్లో ప్రాధాన్యం సంతరించుకుంది. స్థానికంగా తమకు ఉన్న పరిచయాలు, అనుచరగణంతో కొత్త పార్టీలో రాజకీయ కార్యకలాపాలు కొనసాగించేందుకు వారు సిద్ధమవుతున్నట్లు ఈ చేరికలు సూచిస్తున్నాయి. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్, మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావుతోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు. కొత్తగా పార్టీలో చేరిన నాయకులను వారు అభినందించారు. పార్టీ బలోపేతం, జిల్లాలో రాజకీయ కార్యకలాపాల విస్తరణకు ఈ చేరికలు ఉపయోగపడతాయని వైకాపా వర్గాలు భావిస్తున్నాయి. మరోవైపు, గుండ లక్ష్మీదేవి కుటుంబానికి తెలుగుదేశం పార్టీతో ఉన్న దీర్ఘకాలిక అనుబంధం నేపథ్యంలో ఆమె నిర్ణయం రాజకీయంగా చర్చకు దారితీసింది. అయితే పార్టీ మార్పునకు దారితీసిన కారణాలపై ఆమె నుంచి ప్రత్యేకంగా వెల్లడైన వివరాలు అందుబాటులో లేవు.

## శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే ఉపేక్షించేది లేదు: ఏపీ డీజీపీ



**అమరావతి, రాజధాని వాయిస్ :** శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా, నామినేషన్ పత్రాలను చింపేసినా, పోలీసులపై దాడులకు తెగబడినా ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా స్పష్టం చేశారు. రాజకీయ పార్టీలు, హోదాలతో సంబంధం లేకుండా చట్టాన్ని కఠినంగా అమలు చేస్తామని తేల్చి చెప్పారు. ఈ మేరకు రాష్ట్రంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో తొలిరోజు చోటుచేసుకున్న ఘటనలపై డీజీపీ కార్యాలయం ఒక ప్రకటన జారీ చేసింది."ఎంపీటీసీ, జడ్పీటీసీ నామినేషన్ల ప్రక్రియలో భాగంగా తొలిరోజు మొత్తంగా 13 జిల్లాల్లో 31 ఘటనలు నమోదయ్యాయి. వీటిలో 22 ఘర్షణలు, ప్రజాశాంతికి భంగం కలిగించిన ఘటనలు ఉన్నాయి. 9చోట్ల నామినేషన్ పత్రాలను బలవంతంగా లాక్కొని చింపేశారు. నామినేషన్ కేంద్రాల వద్ద ప్రత్యర్థులు తెగబడిన తీరు ప్రజాస్వామ్య వ్యవస్థను విస్మయానికి గురి చేసేలా ఉంది. కనీసం 6 చోట్ల రాళ్లు, కర్రలతో దాడులు జరిగాయి. రెండు కార్లు, రెండు మోటార్ సైకిళ్లు అగ్నికి ఆహుతయ్యాయి. రెండు నివాస గృహాలపై దాడులు జరగగా, ఒక ఇంటిని ఏకంగా జేసీబీ సాయంతో కూల్చివేశారు. అభ్యర్థులకు రక్షణగా వెళ్తున్న పోలీస్ వాహనంపై రాళ్లదాడి చేశారు. ఇప్పటివరకు 16 కేసులు నమోదు చేశాం. మరో 11 ఘటనలపై కేసుల నమోదు ప్రక్రియ జరుగుతోంది. సీసీటీవీ ఫుటేజీలు, వీడియోల ఆధారంగా మరిన్ని అరెస్టులు ఉండే అవకాశం ఉంది. శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో రాజీపడే ప్రసక్తే లేదు. శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే వారు ఎంతటి వారైనా కఠిన చర్యలు తీసుకుంటాం" అని డీజీపీ తన ప్రకటనలో పేర్కొన్నారు.

## ఎన్నికల్లో గెలిచే సత్తా లేకే.. వైకాపా అరాచకాలు: మంత్రి నాదెండ్ల



**తంబళ్లపల్లె, రాజధాని వాయిస్ :** అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లెలో జనసేన కార్యాలయంపై వైకాపా దాడి చేయడం హేయమైన చర్య అని మంత్రి నాదెండ్ల మనోహర్‌అన్నారు. వైకాపా చర్యలను ప్రజాస్వామ్యవాదులు ఖండించాలన్నారు. ఎన్నికల్లో గెలిచే సత్తాలేకే వైకాపా అరాచకాలకు పాల్పడుతోందని విమర్శించారు. జనసేన కార్యాలయాన్ని వైకాపా శ్రేణులు ధ్వంసం చేశాయని, వాహనాలను ధ్వంసం చేసి.. అడ్డువచ్చిన వారిపై దాడులకు తెగబడ్డాయన్నారు. ఎన్నికల వేళ రాష్ట్రంలో శాంతిభద్రతల సమస్య సృష్టించాలని వైకాపా యత్నిస్తోందని ఆక్షేపించారు.

## ఎంత వరకైనా పోరాడదాం: జగన్

**వైసీపీ ముఖ్య నేతలతో ఆ పార్టీ అధినేత జగన్ భేటీ**
**స్థానిక ఎన్నికలకు సంబంధించి సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో చర్చ**
**చంద్రబాబు ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా హింసకు పాల్పడుతోందని ఆరోపణ**



**తాడేపల్లి, రాజధాని వాయిస్ :** వైసీపీ అధినేత జగన్ పార్టీ ముఖ్య నేతలతో సమావేశమయ్యారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా జరుగుతున్న హింస, అక్రమాలపై సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల నేపథ్యంలో ఈ భేటీ జరిగింది. చంద్రబాబు ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా హింసకు పాల్పడుతోందని ఆరోపించిన జగన్, ప్రజాస్వామ్య పరిరక్షణకు న్యాయపోరాటం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు."చంద్రబాబు వ్యవస్థీకృతంగా, ఉద్దేశపూర్వకంగా హింసకు పాల్పడుతున్నారు. ప్రభుత్వాన్ని నడుపుతున్నవారే హింసకు పాల్పడటం ఎక్కడా చూసి ఉండం. పోలీసులను వాడుకుని ఈ దారుణాలన్నీ చంద్రబాబు చేయిస్తున్నారు" అని తీవ్ర స్థాయిలో విమర్శించారు. సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చినా క్షేత్రస్థాయిలో పరిస్థితి మారలేదని ఆవేదన వ్యక్తం చేశారు.క్షేత్రస్థాయిలో వైసీపీ కార్యకర్తలు, నాయకులు ధైర్యం ప్రదర్శిస్తున్నారని జగన్ ప్రశంసించారు. "క్షేత్రస్థాయిలో జరుగుతున్న ఘటనలపై ఆధారాల సేకరణ చాలా అవసరం. పటిష్ఠ ఆధారాలను కోర్టుల ముందు ఉంచడం ద్వారా న్యాయపోరాటం చేద్దాం. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఎందాకైనా పోరాటం చేద్దాం" అని జగన్ పార్టీ నాయకులకు దిశానిర్దేశం చేశారు.

## జడ్పీటీసీ, ఎంపీటీసీల్లోనూ మాకు 30%



**అమరావతి, రాజధాని వాయిస్ :** ముఖ్యమంత్రి చంద్రబాబుతో ఉపముఖ్య మంత్రి పవన్ కల్యాణ్ గురువారం ఉదయం భేటీ అయ్యారు. ఉండవల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయ ంలో సుమారు గంటపాటు వారి సమావేశం జరిగింది. జిల్లా పరిషత్, మండల పరిషత్ ఎన్నికల్లో సీట్ల సర్దుబాటుపై ప్రధానంగా చర్చలు జరిగినట్టు సమాచారం. పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో మాదిరిగానే జడ్పీ, మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాల్లోనూ జనసేనకు 30 శాతం స్థానాలు కావాలని పవన్ కల్యాణ్ ప్రతిపాదించినట్లు తెలిసింది. రాష్ట్రంలో 9,829 ఎంపీటీసీ, 659 జడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు జరుగుతున్నాయి. వాటిలో 30 శాతం జనసేన కోరుతోంది. జడ్పీ ఛైర్మన్, మండల పరిషత్‌ల అధ్యక్ష పదవులు అదే దామాషాలో కావాలని అడుగుతున్నట్టు తెలిసింది. దీనిపై రెండు పార్టీల మధ్య చర్చలు కొనసాగుతున్నాయి. పవన్ కల్యాణ్ సీఎం క్యాంప్ కార్యాలయానికి ఎలాంటి సెక్యూరిటీ, కాన్వాయ్ లేకుండా ఒంటరిగా వెళ్లారు. సుప్రీంకోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో పట్టణ స్థానిక సంస్థలకు సంబంధించిన తాజా పరిణామాలు, కూటమి కార్యాచరణ తదితర అంశాలపైనా వారిద్దరూ చర్చించుకున్నట్టు తెలిసింది.

## ఫిబ్రవరి 24 నుంచి ఏపీలో ఇంటర్ పరీక్షలు.. షెడ్యూల్ విడుదల



**అమరావతి, రాజధాని వాయిస్ :** ఆంధ్రప్రదేశ్‌లో 2027 విద్యాసంవత్సరానికి సంబంధించిన ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల షెడ్యూల్ విడుదలైంది. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులకు థియరీ, ప్రాక్టికల్ పరీక్షల తేదీలను ఇంటర్ బోర్డు ప్రకటించింది. థియరీ పరీక్షలు 2027 ఫిబ్రవరి 24 నుంచి మార్చి 16 వరకు జరగనున్నాయి.వివరాల్లోకి వెళితే, ఇంటర్ ఫస్టియర్ (జూనియర్ ఇంటర్) పరీక్షలు ఫిబ్రవరి 24వ తేదీ నుంచి జరగనుండగా, సెకండియర్ (సీనియర్ ఇంటర్) పరీక్షలు మరుసటి రోజు, అనగా ఫిబ్రవరి 25న మొదలవుతాయి. ప్రతీరోజూ ఉదయం 9:00 గంటల నుంచి మధ్యాహ్నం 12:00 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. థియరీ పరీక్షలకు ముందే ప్రాక్టికల్స్ పూర్తి కానున్నాయి. జనరల్ కోర్సుల విద్యార్థులకు ఫిబ్రవరి 1 నుంచి 10వ తేదీ వరకు ప్రాక్టికల్ పరీక్షలు జరుపుతారు. ఇక ఒకేషనల్ కోర్సుల విద్యార్థులకు ఫిబ్రవరి 1 నుంచి 15వ తేదీ వరకు ప్రాక్టికల్స్ ఉంటాయి. ఈ పరీక్షలను ఆదివారాలతో సహా ప్రతీరోజూ రెండు సెషన్లలో (ఉదయం 9 గంటల నుంచి 12 వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 వరకు) నిర్వహిస్తామని బోర్డు స్పష్టం చేసింది. అయితే, ప్రస్తుతం విడుదల చేసిన ఈ షెడ్యూల్ తాత్కాలికమైనదని (ప్రొవిజనల్) అధికారులు తెలిపారు. ప్రభుత్వ సెలవులు, పండుగల తేదీలను పరిగణనలోకి తీసుకుని తుది షెడ్యూల్‌లో స్వల్ప మార్పులు చేసే అవకాశం ఉందని వారు సూచించారు. విద్యార్థులు ఈ తాత్కాలిక షెడ్యూల్‌ను దృష్టిలో ఉంచుకుని పరీక్షలకు సన్నద్ధం కావాలని నిపుణులు సూచిస్తున్నారు.

# వాటర్ బాటిల్ కోసం హత్య

- విజయవాడలో వెలుగుచూసిన దారుణ ఘటన
- సాయికుమార్‌పై నలుగురు వ్యక్తుల దాడి
- రెండు గంటలపాటు చిత్రహింసలు పెట్టి హతమార్చిన వైనం
- సీసీ కెమెరాల ఆధారంగా నిందితులను పట్టుకున్న పోలీసులు




**విజయవాడ, రాజధాని వాయిస్** కేవలం రూ.20 విలువైన మంచినీటి సీసా విషయంలో తలెత్తిన వివాదం ఓ వ్యక్తి ప్రాణాలను బలిగొంది. విజయవాడలోని పటమట ప్రాంతంలో చోటుచేసుకున్న ఈ ఘటన తీవ్ర కలకలం రేపింది. యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరులోని ఓ అల్పాహార కేంద్రంలో పనిచేస్తున్న సాయికుమార్ (33) ఈ నెల 18న విజయవాడకు వెళ్లాడు. అక్కడ ఓ మద్యం దుకాణం సమీపంలోని తాంబూలం దుకాణంలో ఉన్న శీతలీకరణ పెట్టె నుంచి రూ.20 విలువైన మంచినీటి సీసాను తీసుకునేందుకు ప్రయత్నించినట్లు సమాచారం. ఈ విషయాన్ని గమనించిన పాల సరఫరా వాహనం డ్రైవర్ సాయికుమార్‌ను పట్టుకుని, ఆ దుకాణంలో పనిచేస్తున్న రవిశంకర్‌కు అప్పగించాడు. చిన్న విషయంగా పరిష్కరించాల్సిన ఈ వ్యవహారం క్రమంగా తీవ్ర ఘర్షణకు దారితీసి చివరకు హత్యకు కారణమైంది. రవిశంకర్‌తోపాటు మద్యం దుకాణంలో పనిచేసే అయ్యప్పశంకర్ సాయికుమార్‌పై దాడికి దిగినట్లు తెలిసింది. అనంతరం వారిద్దరూ అతడిని దుకాణం వెనుక ఉన్న సందులోకి తీసుకెళ్లారు. అదే సమయంలో అటుగా వెళ్తున్న పోతంశెట్టి నవీన్, సాయి ప్రణీత్ కూడా వారితో కలిశారు. నలుగురూ కలిసి సాయికుమార్‌ను విచక్షణా రహితంగా కొట్టినట్లు సమాచారం. జరిగిన తప్పును వివరించి, అవసరమైతే సంబంధిత అధికారులకు అప్పగించాల్సిన సందర్భంలో చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని దాడికి పాల్పడటం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఒక చిన్న వివాదాన్ని మాటలతో పరిష్కరించుకునే అవకాశం ఉన్నప్పటికీ, దాడికి పాల్పడటంతో పరిస్థితి విషాదకరంగా మారింది. తనకు భార్య, పిల్లలు ఉన్నారని, దయచేసి వదిలేయాలని సాయికుమార్ నిందితుల కాళ్లావేళ్లా పడి వేడుకున్నప్పటికీ వారు కనికరించలేదని కథనాలు వెల్లడిస్తున్నాయి. అతడిని విద్యుత్తు స్తంభానికి కట్టేసి, కర్రలతో తీవ్రంగా కొట్టినట్లు సమాచారం. సుమారు రెండు గంటలపాటు దాడి కొనసాగడంతో సాయికుమార్ ప్రాణాలు కోల్పోయినట్లు తెలిసింది. కుటుంబాన్ని పోషించాల్సిన వ్యక్తి ఇలా దారుణంగా మృతి చెందడం అతడి కుటుంబాన్ని తీవ్ర విషాదంలోకి నెట్టింది. క్షణికావేశం, చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకునే ధోరణి ఎంతటి దారుణ పరిణామాలకు దారితీస్తాయో ఈ ఘటన స్పష్టం చేస్తోంది. అయితే దాడికి సంబంధించిన పూర్తి వివరాలు, నిందితుల పాత్ర, మరణానికి దారితీసిన పరిస్థితులు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది. ఘటన అనంతరం నిందితులు అక్కడి నుంచి పరారైనట్లు సమాచారం. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు పరిసర ప్రాంతాల్లోని నిఘా కెమెరాల దృశ్యాలను పరిశీలించి, నిందితులను గుర్తించినట్లు తెలిసింది. సీసీ కెమెరాల ఆధారంగా కేసు నమోదు చేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు కథనాలు పేర్కొంటున్నాయి. దాడిలో ఎవరి పాత్ర ఎంతవరకు ఉంది, ఘటనకు ముందు ఏం జరిగింది, దాడి సమయంలో మరెవరైనా అక్కడ ఉన్నారా అనే అంశాలపై పోలీసులు విచారణ చేపట్టాల్సి ఉంది. నిందితులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవడంతోపాటు ఘటనకు సంబంధించిన ఆధారాలను సేకరించడం, ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాలను నమోదు చేయడం దర్యాప్తులో కీలకంగా మారనున్నాయి. అధికారిక పోలీసు ప్రకటనలో వెల్లడయ్యే వివరాల ఆధారంగా కేసు పురోగతిపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. మృతుడు సాయికుమార్ నల్గొండకు చెందిన వ్యక్తిగా గుర్తించినట్లు సమాచారం. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కుటుంబానికి ఆధారంగా ఉన్న వ్యక్తి మృతి చెందడంతో ఆ కుటుంబం దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటోంది. కేవలం రూ.20 విలువైన వస్తువు విషయంలో జరిగిన ఘటన ఒక కుటుంబానికి తీరని నష్టాన్ని మిగిల్చింది. నేరానికి పాల్పడినట్లు అనుమానిస్తున్న వ్యక్తులను చట్టానికి అప్పగించాల్సింది పోయి దాడులకు దిగడం సమాజంలో పెరుగుతున్న అసహన ధోరణికి నిదర్శనంగా నిలుస్తోంది. ఏదైనా తప్పు జరిగినప్పుడు పోలీసులకు సమాచారం ఇవ్వడం, చట్టబద్ధమైన మార్గంలో వ్యవహరించడం ప్రతి ఒక్కరి బాధ్యత. చిన్న వివాదాలు హింసకు దారితీయకుండా ప్రజలు సంయమనం పాటించడంతోపాటు ఇలాంటి ఘటనల్లో బాధ్యులకు చట్టప్రకారం శిక్ష పడేలా న్యాయ ప్రక్రియ కొనసాగడం అవసరం.

## చంద్రబాబు అధ్యక్షతన ఎస్ఐపీబీ సమావేశం.. పెట్టుబడుల ప్రతిపాదనలపై చర్చ

**అమరావతి, రాజధాని వాయిస్** : ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు (ఎస్ఐపీబీ) సమావేశం జరిగింది. పరిశ్రమలు, ఇంధనశాఖ, పర్యాటకం, ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఫుడ్ ప్రాసెసింగ్, మౌలిక సౌకర్యాల కల్పన తదితర రంగాల్లో పెట్టుబడుల ప్రతిపాదనలపై చర్చించారు. గత ఒప్పందాలు పెట్టుబడులుగా మారి ఉత్పత్తి చేపట్టడంపై దృష్టి పెట్టాలని సీఎం సూచించారు. ఇప్పటి వరకు జరిగిన 714 ఒప్పందాల్లో 519 ప్రాజెక్టుల కార్యాచరణ ప్రారంభించినట్లు అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. పెట్టుబడుల సదస్సు కోసం విశాఖలో కన్వెన్షన్ సెంటర్ ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారు. రాయలసీమ గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌లో పెట్టుబడులు, మౌలిక సౌకర్యాల కల్పన, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖలు కీలకమని చెప్పారు. పోర్టులు, ఎయిర్‌పోర్టులు, ఈస్ట్, వెస్ట్ కనెక్టివిటీపై దృష్టి పెట్టాలని సూచించారు. సెమీ కండక్టర్ల తయారీ యూనిట్లతో ఎకోసిస్టం ఏర్పాటు చేయాలన్నారు. ఎస్ఐపీబీ సమావేశానికి మంత్రులు లోకేశ్, టీజీ భరత్, అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, నారాయణ, కందుల దుర్గేశ్ వర్చువల్‌గా హాజరయ్యారు.

## రెండున్నరేళ్లలో కూటమి ప్రభుత్వం కూలిపోతుంది!



**గుంటూరు, రాజధాని వాయిస్** గుంటూరు మాజీ మంత్రి అంబటి రాంబాబు కామెంట్స్ రాష్ట్రంలో లోకల్ బాడీ ఎన్నికల్లో విచిత్ర పరిణామాలు జరుగుతున్నాయి. మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో అవాంఛనీయ సంఘటనలు 19 చోట్ల జరిగాయి. దానిపై సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు తాత్కాలికంగా ఎన్నికలను నిలిపివేశారు. అంతే కానీ మొత్తం స్తానాల్లో నిలుపుదల చేయలేదు. సుప్రీంకోర్టు స్పంధించటం వల్లనే ఎన్నికల కమీషన్,పోలీసులు తమ వైఖరి మార్చుకున్నారు. ప్రజల్లో కూటమి పట్ల వ్యతిరేకత పెరిగి,వైసీపీకి అనుకూలత పెరిగింది. అందుకే చంద్రబాబు నాయుడు అరాచకాలను ప్రోత్సహి స్తున్నారు. సాయికృష్ణ లాకప్ డెత్ విషయంలో సుప్రీంకోర్టు ఆదేశాల మేరకే 25 లక్షల నష్టపరిహారం ప్రభుత్వం ఇస్తుంది. ఐపీఎస్,ఐఏఎస్ అధికారులు తమ తప్పులను సరిచేసుకోవాలి. తప్పులు చేసిన ఏ అధికారినీ వైసీపీ ప్రభుత్వం వదిలిపెట్టదు,కోర్టు ముందు నిలబెడుతుంది. ఎన్నోచోట్ల నామినేషన్లు వేయకుండా పోలిసులను అడ్డుపెట్టుకుని కూటమి నాయకులు బెదిరిస్తున్నారు. గుంటూరులో నామినేషన్ల ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో జరిగింది. రెండున్నర ఏళ్ళలో కూటమి ప్రభుత్వం కూలిపోయి,జగన్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుంది. గుంటూరులో 76 స్థానాల్లో వైసీపీ పోటీ చేస్తుంది. సుప్రీంకోర్టు పర్యవేక్షణలో ఈ ఎన్నికలు జరుగుతున్నాయి. జిల్లాపరిషత్, ఎంపీటీసీ ఎన్నికల్లో నామినేషన్లు వేయనీయకుండా పల్నాడులో వైసీపీ అభ్యర్థులను కిడ్నాప్ చేస్తున్నారు. దీనిపై కూడా వైసీపీ కోర్టును ఆశ్రయిస్తుంది. వ్యవస్థలన్నీ చంద్రబాబు గుప్పెట్లో పెట్టుకుని గెలుపొందాలని చూస్తున్నారు. అందుకే సుప్రీంకోర్టు స్పంధించేవరకూ ఎన్నికల కమీషన్ స్పందించలేదు.

## పవన్ రాజీనామా అంటూ ఫేక్ న్యూస్: సైబర్ చర్యల హెచ్చరికతో క్షమాపణ చెప్పిన వాట్సాప్ గ్రూప్ అడ్మిన్

**అమరావతి, రాజధాని వాయిస్** ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తన పదవికి రాజీనామా చేస్తున్నారంటూ వాట్సాప్‌లో తప్పుడు సమాచారాన్ని సర్క్యులేట్ చేసిన ఓ వాట్సాప్ గ్రూప్ అడ్మిన్ క్షమాపణలు చెప్పారు. ఈ ఫేక్ న్యూస్‌ను తీవ్రంగా పరిగణించిన ఉప ముఖ్యమంత్రి కార్యాలయం సైబర్ క్రైమ్ విభాగానికి ఫిర్యాదు చేయాలని నిర్ణయించడంతో, సదరు అడ్మిన్ వెనక్కి తగ్గారు. సోషల్ మీడియాలో వచ్చిన ఒక పోస్ట్ చూసి, నిజానిజాలు నిర్ధారించుకోకుండా "పవన్ కల్యాణ్ డిప్యూటీ సీఎం పదవికి రాజీనామా" అని గ్రూప్‌లో షేర్ చేసినట్లు అడ్మిన్ తన వివరణలో తెలిపారు. ఇది ఎలాంటి దురుద్దేశంతో జరగలేదని, పొరపాటున జరిగిందని పేర్కొన్నారు. ఈ ఘటనపై పవన్ కల్యాణ్‌కు, జనసేన నాయకులకు, కార్యకర్తలకు, గ్రూప్ సభ్యులకు మనస్ఫూర్తిగా క్షమాపణ చెబుతున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో పూర్తి వివరాలు తెలుసుకున్నాకే పోస్టులు షేర్ చేస్తానని హామీ ఇచ్చారు. అంతకుముందు, పవన్ రాజీనామా చేస్తున్నారంటూ జరుగుతున్న ప్రచారంపై డిప్యూటీ సీఎం కార్యాలయం తీవ్రంగా స్పందించింది. "డిప్యూటీ సీఎంఓ, ఆంధ్రప్రదేశ్" పేరుతో నడుస్తున్న ఫేక్ వాట్సాప్ ఛానెల్‌పై, ఇతర తప్పుడు ప్రచారాలపై సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసి, ఎఫ్ఐఆర్ నమోదు చేయిస్తున్నట్లు ప్రకటించింది. ప్రభుత్వ కార్యాలయం పేరును దుర్వినియోగం చేస్తూ తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది. ఈ అధికారిక హెచ్చరికల నేపథ్యంలోనే వాట్సాప్ అడ్మిన్ క్షమాపణ చెప్పినట్లు స్పష్టమవుతోంది.



## కోటవురట్ల అభివృద్ధి కొనసాగాలి



**అనకాపల్లి, రాజధాని వాయిస్** కోటవురట్ల ప్రాంత అభివృద్ధి నిరంతరం కొనసాగాలని, ప్రతి గ్రామం ప్రగతి పథంలో ముందుకు సాగాలని రాష్ట్ర హోంమంత్రి అనిత ఆకాంక్షించారు. ఎంపీపీ అభ్యర్థి శెట్టి గీత, జెడ్పీటీసీ అభ్యర్థి పురం నాగవేణి నామినేషన్ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కూటమి శ్రేణులతో కలిసి నిర్వహించిన భారీ ర్యాలీలో పాల్గొని ప్రజలను కలిశారు. తమపై నమ్మకం ఉంచి మరోసారి సేవ చేసే అవకాశం కల్పించాలని కోరుతూ ఓట్లు అభ్యర్థించారు. కోటవురట్ల ప్రాంతంలో అభివృద్ధి కార్యక్రమాలను మరింత ముందుకు తీసుకెళ్తామని ప్రజలకు భరోసా ఇచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో కూటమి అభ్యర్థులకు మద్దతుగా హోంమంత్రి అనిత ప్రచార కార్యక్రమంలో పాల్గొనడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఎంపీపీ, జెడ్పీటీసీ స్థానాలకు పోటీ చేస్తున్న అభ్యర్థులను ప్రజలకు పరిచయం చేస్తూ వారి విజయానికి సహకరించాలని కోరారు. ప్రజల విశ్వాసమే తమకు బలమని పేర్కొంటూ, స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. గ్రామాల అవసరాలను గుర్తించి అభివృద్ధి పనులు చేపట్టడం ద్వారా ప్రజలకు మెరుగైన సదుపాయాలు కల్పించాలన్నదే తమ లక్ష్యమని ఆమె పేర్కొన్నారు. కోటవురట్ల ప్రాంతంలో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రస్తావించిన అనిత, జల్లూరు, పందూరు వంతెనల నిర్మాణ పనులను తమ నిబద్ధతకు నిదర్శనంగా పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలు మెరుగుపడితే ప్రజలకు రోజువారీ ప్రయాణాలు సులభతరమవుతాయని, వ్యవసాయం, విద్య, వైద్యం వంటి అవసరాలకు ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. ఇప్పటికే చేపట్టిన పనులతో పాటు భవిష్యత్తులోనూ ప్రాంత అభివృద్ధికి ప్రాధాన్యమిస్తామని వెల్లడించారు. గ్రామాల మధ్య అనుసంధానం పెంపొందించడం, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడం అభివృద్ధిలో కీలకమని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ద్వారా గ్రామాల అవసరాలను గుర్తించి సమస్యలను పరిష్కరించేందుకు ప్రజాప్రతినిధులకు అవకాశం ఉంటుందని అనిత తెలిపారు. ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల్లో పోటీ చేస్తున్న కూటమి అభ్యర్థులకు ప్రజలు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

## విధ్వంసం సృష్టించి బాధితులుగా నటించడం వైసీపీ నైజం: ఉండవల్లి శ్రీదేవి



**అమరావతి, రాజధాని వాయిస్** విధ్వంసాలు సృష్టించి, ఆ తర్వాత బాధితులుగా నటించడమే వైసీపీ రాజకీయమని మాదిగ కార్పొరేషన్ చైర్మన్ ఉండవల్లి శ్రీదేవి విమర్శించారు. గురువారం మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ, గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రతిపక్షాలను అణచివేసి, అక్రమ కేసులతో వేధించిన నాయకులు ఇప్పుడు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజలు వైసీపీని 11 సీట్లకు పరిమితం చేసినా ఆ పార్టీ వైఖరిలో మార్పు రాలేదని విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా గంజాయి బ్యాచ్‌లు, రౌడీ మూకలతో అల్లర్లు సృష్టించేందుకు వైసీపీ ప్రయత్నిస్తోందని శ్రీదేవి ఆరోపించారు. ఎంపీ మిథున్ రెడ్డి పెద్ద కాన్వాయ్‌తో వచ్చి ఘర్షణలకు కారణమయ్యారని, ఈ ఘటనల్లో టీడీపీ కార్యకర్తలు సహా పలువురికి గాయాలయ్యాయని పేర్కొన్నారు. తిరుపతి, రాయచోటి, పులివెందుల, పుంగనూరు ప్రాంతాల్లో నేరచరిత్ర ఉన్నవారితో ఉద్రిక్తతలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. అయితే, ఎన్నికల్లో గెలవాలంటే ప్రజల మద్దతు పొందాలని, భయభ్రాంతులకు గురిచేసి గెలుస్తామనుకోవడం వైసీపీ భ్రమేనని అన్నారు. బీసీల రాజకీయ ప్రాతినిధ్యంపై మాట్లాడుతూ, వైసీపీ పాలనలో 34 శాతం రిజర్వేషన్లు అమలు చేయకపోవడంతో 16,800 మంది బీసీలు రాజకీయ పదవులకు దూరమయ్యారని శ్రీదేవి ఆరోపించారు. కూటమి ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు 67.6 శాతం సీట్లు కేటాయించిందని తెలిపారు. బీసీలకు దాదాపు 34 శాతం రాజకీయ ప్రాతినిధ్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. మహిళలు ఆర్థికంగా, రాజకీయంగా ఎదిగేందుకు కూటమి ప్రభుత్వం అవకాశాలు కల్పిస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తోందని శ్రీదేవి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తొలి సంతకం చేసిన మెగా డీఎస్సీ ద్వారా 16 వేల మందికి పైగా ఉద్యోగాలు కల్పించామని, మరో డీఎస్సీని కూడా ప్రకటించామని తెలిపారు. రాష్ట్రానికి సుమారు రూ.26 లక్షల కోట్ల పెట్టుబడులకు సంబంధించిన ఒప్పందాలు రావడం ద్వారా పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని చెప్పారు. అమరావతి నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు, పారిశ్రామిక అభివృద్ధి పనులు ముందుకు సాగుతున్నాయని వివరించారు. సూపర్ సిక్స్ హామీల అమలులో భాగంగా తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, దీపం-2 పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. అర్హులైన మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్లు, రైతులకు ఆర్థిక సాయం అందిస్తున్నామని చెప్పారు. గతంలో వైసీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలులో ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో నిలబెట్టుకోలేదని విమర్శించారు. తిరుమల లడ్డూ ప్రసాదం అంశాన్ని ప్రస్తావిస్తూ, భక్తుల మనోభావాలను దెబ్బతీసే పరిణామాలకు వైసీపీ పాలనలో చోటు కలిగిందని ఆరోపించారు. అలాగే, కుటుంబ ఆస్తుల వివాదంలో తల్లి విజయమ్మ, చెల్లి షర్మిలకు న్యాయం చేయలేని జగన్ రాష్ట్ర ప్రజలకు ఏం చేస్తారని ప్రశ్నించారు. ప్రజలు వైసీపీ రాజకీయాలను నమ్మే పరిస్థితిలో లేరని, ముఖ్యంగా మహిళలు ఆ పార్టీకి మరో అవకాశం ఇవ్వబోరని శ్రీదేవి అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అన్ని వర్గాలు సహకరించాలని కోరారు. అల్లర్లు, విధ్వంసాలకు పాల్పడే వారిపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని హెచ్చరించారు. అభివృద్ధి, సంక్షేమంతో ముందుకు సాగుతున్న కూటమి ప్రభుత్వానికి ప్రజలు మద్దతుగా నిలవాలని ఆమె విజ్ఞప్తి చేశారు...

## సుప్రీంకోర్టు ఆదేశాలు చదివావా ధర్మానా..? అసలు నీకు అర్థమయ్యాయా..?

**అమరావతి, రాజధాని వాయిస్** సుప్రీంకోర్టు ఆదేశాల ను కూడా చదివి అర్థం చేసుకోవడం రాని గొడ్డలి పార్టీ నాయకుల నుంచి సరైన విశ్లేషణ ఆశించడం మాదే తప్పని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఉత్తరాంధ్రలో తానే అత్యంత తెలివైనవాడినని తనకు తాను చెప్పుకునే ధర్మాన సుప్రీంకోర్టు ఆదేశాలు చదివావా? అవి నీకు అర్థమయ్యాయా? అని ప్రశ్నించారు. తుది జాబితా ప్రచురణను ఈ నెల 25 వరకు వాయిదా వేయాలని, నామినేషన్లు దాఖలు చేయకుండా అడ్డుకున్నారనే ఫిర్యాదులు అందితే సంబంధిత సాక్ష్యాధారాలు, ఎలక్ట్రానిక్ సాక్ష్యాలతో సహా రాష్ట్ర ఎన్నికల కమిషన్ పరిశీలించాలని సుప్రీంకోర్టు ఆదేశించిందన్నారు. శాంతిభద్రతల సమస్య కారణంగా అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయలేక పోయారని నిర్ధారణ అయితే ఆ పట్టణ స్థానిక సంస్థల్లో మాత్రమే నామినేషన్ల గడువును పొడిగించాలని, ఆ పొడిగింపు కూడా నిర్ణయం తీసుకున్నప్పటి నుంచి 48 గంటలు మాత్రమే ఉండాలని స్పష్టం చేసిందన్నారు. ఇంత స్పష్టంగా ఉన్న ఆదేశాలను వక్రీకరించి ప్రభుత్వానికి 'చెంపదెబ్బ' అంటూ ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజాస్వామ్యబద్ధంగా పరిస్థితులు ఉన్నాయి కాబట్టే వైసీపీ అభ్యర్థులు టీడీపీ అభ్యర్థులతో సమానంగా నామినేషన్లు దాఖలు చేయగలిగారని, మేము ప్రజాక్షేత్రంలో తేల్చుకునే వాళ్లమే తప్ప అక్రమంగా అడ్డుకునే వాళ్లం కాదని స్పష్టం చేశారు. 2021 స్థానిక ఎన్నికల ప్రక్రియలో మీ దౌర్జన్యాలను ప్రజలు ఇంకా మరిచిపోలేదని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. అభ్యర్థులను, ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి, ఫిర్యాదు చేసినా, కోర్టును ఆశ్రయించినా చంపేస్తారనే భయం కల్పించి, 80 శాతం స్థానిక సంస్థల్లో ఏకగ్రీవాలు చేసుకున్న చరిత్ర మీది అని ఆరోపించారు. అదే మీ రప్పా రప్పా రాజ్యాంగం అంటూ ఎద్దేవా చేశారు. అప్పటి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేష్‌కుమార్ ని అక్రమంగా తొలగించిన తీరు, కోర్టు ద్వారా ఆయన తిరిగి నియమితులైన తర్వాత కూడా ఆయనపై చేసిన వ్యక్తిత్వ హననం ప్రజలు మరిచిపోలేదన్నారు. ఇలాంటి చరిత్ర ఉన్న మీ పార్టీ, మీ గొడ్డలి పార్టీ అధ్యక్షుడు రాజ్యాంగ సంస్థలు, ప్రజాస్వామ్య విలువల గురించి మాట్లాడుతుంటే దయ్యాలు వేదాలు వల్లించినట్లుందని విమర్శించారు. రాజ్యాంగ వ్యవస్థల పట్ల మీకున్న గౌరవమేమిటో మీ గత చరిత్రే చెబుతోందని అన్నారు. తాడేపల్లి ప్యాలెస్‌లో జగన్ రెడ్డి ఇచ్చే ఆదేశాల మేరకే గొడ్డలి పార్టీ రౌడీమూకలు క్షేత్రస్థాయిలో బరితెగించి దౌర్జన్యాలకు పాల్పడుతున్నాయని మంత్రి అచ్చెన్నాయుడు ఆరోపించారు. రాష్ట్రంలో ప్రశాంత వాతావరణం ఉంటే తమ ఉనికికే ప్రమాదమని అల్లర్లు సృష్టించి పబ్బం గడుపుకుంటున్నారని మండిపడ్డారు. గతంలో గులకరాయి, కోడికత్తి నాటకాలతో సానుభూతి పొందేందుకు ప్రయత్నించినట్లే, ఇప్పుడు తామే అల్లర్లు సృష్టించి శాంతిభద్రతలు లేవంటూ సానుభూతి పొందాలనుకుంటున్నారని విమర్శించారు. కానీ ప్రజలు మీ నైజాన్ని ఇప్పటికే తెలుసుకున్నారని, ఇక మీ ఆటలు చెల్లవని హెచ్చరించారు. పుంగనూరులో ఎంపీ కాన్వాయ్‌లో మారణాయుధాలు, మద్యం బాటిళ్లు పెట్టుకుని ప్రశాంత వాతావరణాన్ని చెడగొట్టాలని చూసింది మీ గొడ్డలి పార్టీ కాదా అని సూటిగా ప్రశ్నించారు. ప్రజాక్షేత్రంలో ఘోర పరాజయం తప్పదని ముందే తెలిసిపోయి, కనీసం పోటీ చేయడానికి అభ్యర్థులు కూడా దొరకక, ఇప్పుడు పోలీసులు అడ్డుకుంటున్నారని, ఎన్ఓసీలు ఇవ్వడం లేదని కుంటిసాకులు చెబుతున్నారని మంత్రి అచ్చెన్నాయుడు విమర్శించారు. మాది ప్రజాస్వామ్యబద్ధమైన ప్రభుత్వం కాబట్టే రాష్ట్ర ఎన్నికల కమిషన్ స్వతంత్రంగా తన విధులు నిర్వర్తించగలుగుతోందన్నారు. ఎన్ఓసీల అవసరం లేదని స్పష్టం చేయడంతోపాటు, చిన్న ఫిర్యాదు అందినా పూర్తిస్థాయిలో పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్లు, ఎస్పీలకు ఆదేశాలు ఇచ్చేంత స్వేచ్ఛగా ఎన్నికల కమిషన్ పనిచేస్తోందని పేర్కొన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు గొడ్డలి పార్టీ గూండాగిరికి, ఫ్యాక్షన్ సంస్కృతికి రాజకీయంగా సమాధి కట్టడం ఖాయమని అన్నారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ రాష్ట్రాన్ని అశాంతిపాలు చేయాలని చూసే గొడ్డలి పార్టీ ముఠా నాయకుల్లో ఏ ఒక్కరినీ కూటమి ప్రభుత్వం ఉపేక్షించదని, చట్టప్రకారం చర్యలు తీసుకుంటుందని మంత్రి అచ్చెన్నాయుడు హెచ్చరించారు.



## సారస్ మేళాలో మహిళా పారిశ్రామికవేత్తలకు రంజనా నాయక్ స్ఫూర్తి

**విజయవాడ, రాజధాని వాయిస్** జాతీయ సారస్ ఆజీవిక మేళా--2026లో భాగంగా విజయవాడ పున్నమి ఘాట్‌లో నిర్వహిస్తున్న ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్ మెంట్ పెవిలియన్‌లో SWANOTEL వ్యవస్థాపకురాలు రంజనా నాయక్ సుమారు 300 మంది స్వయం సహాయక సంఘాల (SHG) మహిళా పారిశ్రామికవేత్తలతో ముఖాముఖి నిర్వహించారు. హైదరాబాద్ గచ్చిబౌలిలో 70 గదులతో SWANOTEL హోటల్‌ను విజయవంతంగా నిర్వహిస్తున్న తన పారిశ్రామిక ప్రయాణాన్ని ఆమె వివరించారు. బీఎస్సీ విద్యతో పాటు ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో పొందిన విద్య వ్యాపార ఆలోచనలు, లక్ష్యాల రూపకల్పనకు దోహదపడిందన్నారు. సుమారు 20 ఏళ్ల క్రితం హోమ్‌స్టేలు, అపార్ట్‌మెంట్ ఆధారిత వసతి సేవలతో ప్రారంభించిన వ్యాపారాన్ని క్రమంగా లగ్జరీ హోటల్ స్థాయికి విస్తరించినట్లు తెలిపారు. హాస్పిటాలిటీ, పర్యాటక రంగాల్లో మహిళలకు విస్తృత అవకాశాలు ఉన్నాయని రంజనా నాయక్ పేర్కొన్నారు. హోమ్‌స్టేలు, సర్వీస్డ్ అపార్ట్‌మెంట్లు, అతిథుల వసతి, పర్యాటక అనుబంధ సేవలను వ్యాపారాలుగా అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. స్థానిక అవకాశాలను గుర్తించి, అందుబాటులో ఉన్న వనరులను సమర్థంగా వినియోగించుకుని నాణ్యమైన సేవలు అందిస్తే మహిళలు విజయవంతమైన పారిశ్రామికవేత్తలుగా ఎదగవచ్చని సూచించారు. SHG మహిళలు వ్యక్తిగతంగా లేదా సమష్టిగా వ్యాపారాలను ప్రారంభించడం ద్వారా కుటుంబాలకు స్థిరమైన ఆదాయంతో పాటు స్థానికంగా ఉపాధి అవకాశాలను కల్పించవచ్చని తెలిపారు.

# నామినేషన్ కేంద్రాల వద్ద పోలీసుల నిఘా



**అనకాపల్లి, రాజధాని వాయిస్ :** అనకాపల్లి జిల్లాలో జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాలు, మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ రెండో రోజుకు చేరడంతో పోలీసులు భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. నామినేషన్ కేంద్రాలు, వాటి పరిసర ప్రాంతాల్లో చేపట్టిన భద్రతా ఏర్పాట్లను జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బుచ్చయ్యపేట, రావికమతం, రోలుగుంట మండలాల్లోని ఎంపీడీవో కార్యాలయాలను సందర్శించి పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. నామినేషన్ల దాఖలు సమయంలో అభ్యర్థులు, రాజకీయ పార్టీల కార్యకర్తల మధ్య ఎలాంటి వాగ్వాదాలు, ఘర్షణలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.బుచ్చయ్యపేట మండలంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద కొత్తకోట సీఐ జి.కోటేశ్వరరావు, ఎస్సై మనోజ్‌కుమార్‌తో కలిసి భద్రతా ఏర్పాట్లను ఎస్పీ పరిశీలించారు. రావికమతం ఎంపీడీవో కార్యాలయం వద్ద కొత్తకోట ఎస్సై శ్రీనివాస్‌తో, రోలుగుంట ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎస్సై రామకృష్ణారావుతో కలిసి పరిస్థితులను సమీక్షించారు. అనంతరం జిల్లా పరిషత్ కార్యాలయం పరిసర ప్రాంతాల్లో బందోబస్తును తనిఖీ చేశారు. నామినేషన్ కేంద్రాల వద్ద విధులు నిర్వహించే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.నామినేషన్ కేంద్రాల చుట్టూ వంద మీటర్ల పరిధిలో నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని ఎస్పీ సూచించారు. ఆ పరిధిలో అనవసరమైన వ్యక్తులు గుమిగూడకుండా చూడాలని, గుంపులు ఏర్పడితే వెంటనే చెదరగొట్టాలని ఆదేశించారు. నామినేషన్ దాఖలు చేసేందుకు వచ్చే అభ్యర్థితో పాటు నలుగురికి మించి లోపలికి అనుమతించకూడదని స్పష్టం చేశారు. నామినేషన్ ప్రక్రియ పూర్తయిన వెంటనే అభ్యర్థులు, వారితో వచ్చిన వ్యక్తులు అక్కడే ఉండకుండా వెనుదిరిగేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. వేర్వేరు రాజకీయ పార్టీలకు చెందిన వ్యక్తుల మధ్య ఘర్షణలకు అవకాశం లేకుండా కేంద్రాల వెలుపల కూడా తగిన పర్యవేక్షణ ఉండాలని పేర్కొన్నారు.రాజకీయ పార్టీలు ర్యాలీలతో నామినేషన్లు దాఖలు చేసేందుకు వచ్చే సందర్భాల్లో సమయాల విషయంలో పరస్పర సమన్వయం పాటించాలని ఎస్పీ సూచించారు. ఒకే సమయంలో పలు పార్టీల ర్యాలీలు నామినేషన్ కేంద్రాలకు చేరకుండా తగిన ఏర్పాట్లు చేసుకోవాలని, తద్వారా రద్దీని నియంత్రించి శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా చూడాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. నామినేషన్ల ప్రక్రియ సజావుగా సాగేందుకు పోలీసు సిబ్బంది, ఎన్నికల అధికారులు సమన్వయంతో పనిచేయాలని చెప్పారు. కేంద్రాలు, పరిసర ప్రాంతాల్లో డ్రోన్ల ద్వారా నిరంతర నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పోలీసు శాఖ చర్యలు చేపట్టిందని ఎస్పీ తెలిపారు. పోలీసు చట్టంలోని సెక్షన్ 30, భారతీయ నాగరిక సురక్ష సంహితలోని సెక్షన్ 163 అమల్లో ఉన్నట్లు పేర్కొంటూ వాటిని ప్రతి ఒక్కరూ పాటించాలని సూచించారు. నామినేషన్ కేంద్రాల వద్ద విధులు నిర్వహించే అధికారులు అప్రమత్తంగా ఉండటంతో పాటు, సమస్యలు తలెత్తినప్పుడు తక్షణమే స్పందించాలని ఆదేశించారు. అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజలు పోలీసు శాఖకు సహకరించి ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా చూడాలని కోరారు. ఈ పర్యటనలో సంబంధిత పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ కీలక భేటీ!

**గుంటూరు, రాజధాని వాయిస్ :** జిల్లాలో ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా జరుగుతుందని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి సి.యం.సాయికాంత్ వర్మ తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎన్నికల నిర్వహణపై కలెక్టర్ కార్యాలయంలో గురువారం సమావేశం జరిగింది.ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి సి.యం. సాయికాంత్ వర్మ, సాధారణ పరిశీలకులు వీరబ్రహ్మయ్య, వ్యయ పరిశీలకులు నందిని సలారియా పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి సి.యం.సాయికాంత్ వర్మ ఎన్నికల ప్రక్రియను వివరించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎన్నికల నిర్వహణపై సమాచారం, స్పందన తెలియజేస్తే అందుకు అనుగుణంగా చర్యలు చేపడతామని తెలిపారు.ఓటరు చీటీలు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా జరుగుతున్నాయని రాజకీయ పార్టీల ప్రతినిధులు అన్నారు. డివిజన్ల విభజన కారణంగా ఓటు ఎక్కడ ఉందో కొంత మందికి తెలియడం లేదని, దానిపై దృష్టి పెడితే బాగుంటుందని సూచించారు.ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి, గుంటూరు నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ ఐ.కిషోర్,



కాంగ్రెసు పార్టీ ప్రతినిధి బోట్ల బ్రహ్మయ్య, తెలుగుదేశం పార్టీ ప్రతినిధులు కంచర్ల శివరామయ్య, ఎన్.ఓంకార్, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి డా.టి.సేవ కుమార్, బహుజన సమాజ్ పార్టీ ప్రతినిధి చిరతన గండ్ల వాసు, సి.పి.యం ప్రతినిధి బి. ముత్యాల రావు, వైఎస్ఆర్సిపి ప్రతినిధి వై పిచ్చి రెడ్డి, జన సేన పార్టీ ప్రతినిధి త్రినాథ్, భారతీయ జనతా పార్టీ ప్రతినిధి వై వి సుబ్బారావు, తదితరులు హాజరయ్యారు.

# నామినేషన్ నిబంధనలు పాటించాలి: ఎస్పీ రాహుల్ మీనా



**అమలాపురం, రాజధాని వాయిస్** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జరుగుతున్న పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలు-2026కు సంబంధించి,పోటీ చేస్తున్న అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, మద్దతుదారులు మరియు సాధారణ ప్రజలందరూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘం మరియు సంబంధిత ఎన్నికల అధికారులు జారీ చేసిన ఎన్నికల నిబంధనలు,సూచనలు మరియు మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలని తెలియజేయడమైనది. నామినేషన్ కేంద్రాలకు చేరుకోవడం మరియు నామినేషన్ పత్రాల దాఖలుకు సంబంధించి ఈ నిబంధనలు వర్తిస్తాయి.ఎన్నికల ప్రక్రియ శాంతియుతంగా, పారదర్శకంగా,స్వేచ్ఛగా మరియు నిష్పక్షపాతంగా జరిగేలా చూసేందుకు క్రింది సూచనలను ఖచ్చితంగా పాటించాలి.నామినేషన్ కేంద్రాలకు చేరుకోవడం అభ్యర్థులు ప్రజా శాంతికి భంగం కలిగించకుండా లేదా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు ఇవ్వకుండా,శాంతియుతంగా నిర్దేశిత నామినేషన్ కేంద్రాలకు చేరుకోవాలి.అభ్యర్థులు మరియు వారి మద్దతుదారులు పోలీసు సిబ్బంది మరియు ఎన్నికల అధికారులతో సహకరించాలి మరియు నిర్ణయించిన మార్గాలు,భద్రతా ఏర్పాట్లు మరియు ప్రవేశానికి సంబంధించిన సూచనలను పాటించాలి.అనధికారిక ఊరేగింపులు, చట్టవిరుద్ధమైన గుమికూడటాలు, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించడం మరియు ప్రజలకు అసౌకర్యం కలిగించే కార్యకలాపాలు అనుమతించబడవు.సంబంధిత అధికారుల అనుమతి లేకుండా ఎవరూ పరిమిత ప్రాంతాల్లోకి లేదా ఎన్నికల అధికారి/రిటర్నింగ్ అధికారి కార్యాలయంలోకి ప్రవేశించకూడదు.వాహనాలు మరియు వ్యక్తుల సంఖ్యపై నిబంధనలునామినేషన్ కేంద్రాల పరిసరాల్లోకి వాహనాల ప్రవేశంపై మరియు కార్యాలయం లోపల అనుమతించబడే వ్యక్తుల సంఖ్యపై విధించిన నిబంధనలను అభ్యర్థులు ఖచ్చితంగా పాటించాలి.మున్సిపల్ ఎన్నికలకు సాధారణంగా వర్తించే సూచనల ప్రకారం,ఎన్నికల అధికారి కార్యాలయం నుండి 100 మీటర్ల వ్యాసార్థం లో కేవలం ఒక వాహనం మాత్రమే అనుమతించ బడుతుంది.అలాగే, నామినేషన్ దాఖలు చేసే సమయంలో అభ్యర్థి తో సహా గరిష్టంగా ముగ్గురు వ్యక్తులను మాత్రమే కార్యాలయం లోపలికి అనుమతించవచ్చు.అయితే, అభ్యర్థులు తమ సంబంధిత నామినేషన్ కేంద్రాలకు వర్తించే నిర్దిష్ట సూచనలను పరిశీలించి పాటించాలి.సంబంధిత అధికారుల అనుమతి లేకుండా ఎవరూ పరిమిత ప్రాంతాల్లోకి లేదా ఎన్నికల అధికారి/రిటర్నింగ్ అధికారి కార్యాలయంలోకి ప్రవేశించకూడదు.వాహనాలు మరియు వ్యక్తుల సంఖ్యపై నిబంధనలునామినేషన్ కేంద్రాల పరిసరాల్లోకి వాహనాల ప్రవేశంపై మరియు కార్యాలయం లోపల అనుమతించబడే వ్యక్తుల సంఖ్యపై విధించిన నిబంధనలను అభ్యర్థులు ఖచ్చితంగా పాటించాలి.మున్సిపల్ ఎన్నికలకు సాధారణంగా వర్తించే సూచనల ప్రకారం,ఎన్నికల అధికారి కార్యాలయం నుండి 100 మీటర్ల వ్యాసార్థం లో కేవలం ఒక వాహనం మాత్రమే అనుమతించ బడుతుంది.అలాగే, నామినేషన్ దాఖలు చేసే సమయంలో అభ్యర్థి తో సహా గరిష్టంగా ముగ్గురు వ్యక్తులను మాత్రమే కార్యాలయం లోపలికి అనుమతించవచ్చు.అయితే, అభ్యర్థులు తమ సంబంధిత నామినేషన్ కేంద్రాలకు వర్తించే నిర్దిష్ట సూచనలను పరిశీలించి పాటించాలి.నామినేషన్ ప్రక్రియ సమయంలో ఇతర అభ్యర్థులను లేదా ఎన్నికల అధికారులను అడ్డుకోవడం, బెదిరించడం,దాడి చేయడం లేదా చట్టవిరుద్ధంగా ప్రభావితం చేయడం ఖచ్చితంగా నిషేధించబడింది.శాంతిభద్రతల పరిరక్షణ ప్రతి అభ్యర్థి మరియు రాజకీయ పార్టీ తమ మద్దతుదారులు శాంతియుతంగా ప్రవర్తించేలా,క్రమశిక్షణ పాటించేలా మరియు సంయమనం పాటించేలా చూసుకోవాలి.నామినేషన్ కేంద్రానికి లేదా నామినేషన్ పత్రాల దాఖలుకు వెళ్లే ఏ అభ్యర్థి నైనా నిరోధించడం, బెదిరించడం లేదా భయభ్రాంతులకు గురిచేయడం ఖచ్చితంగా నిషేధించబడింది.నామినేషన్ పత్రాలను లేదా ఇతర ఎన్నికలకు సంబంధించిన రికార్డులను ధ్వంసం చేయడం, లాక్కోవడం లేదా జోక్యం చేసుకోవడం నిషేధించబడింది.నామినేషన్ల దాఖలులో ఏవైనా అడ్డంకులు ఎదురైనా,బెదిరింపులు వచ్చినా, ప్రవేశాన్ని నిరాకరించినా లేదా నామినేషన్ పత్రాలను స్వీకరించడానికి నిరాకరించినా,ఆ విషయాన్ని వెంటనే సంబంధిత ఎన్నికల అధికారి/రిటర్నింగ్ అధికారి మరియు పోలీసు అధికారుల దృష్టికి తీసుకురావాలి.అందుబాటులో ఉన్న ఆధారాలను భద్రపరిచి సమర్థ అధికారులకు సమర్పించవచ్చు.

# కూటమి అభ్యర్థులకు ప్రజల అండ: చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

**వినుకొండ, రాజధాని వాయిస్** వినుకొండ మున్సిపల్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోందని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ధీమా వ్యక్తం చేశారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం పట్టణంలోని 32, 33, 34వ వార్డుల్లో ఆయన విస్తృతంగా పర్యటించి కూటమి అభ్యర్థుల తరపున ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా కూటమి బలపరిచిన చైర్మన్ అభ్యర్థి చెరుకుంపాలెం షమీంఖాన్‌తో పాటు ఆయా వార్డుల కౌన్సిలర్ అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలుసుకుంటూ కూటమి అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. పట్టణ అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పట్టణంలో కనీసం సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థలను కూడా సక్రమంగా అభివృద్ధి చేయలేదని జీవీ ఆంజనేయులు విమర్శించారు. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు



కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.వినుకొండ పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు సుమారు రూ.240 కోట్లతో చేపట్టిన శాశ్వత తాగునీటి పథకాన్ని త్వరలోనే పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని పేర్కొంటూ, రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# ఫోటో ఓటరు స్లిప్‌లు పంపిణీ చేయాలి

**గుంటూరు, రాజధాని వాయిస్** మున్సిపాలిటీ ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఫోటో ఓటరు స్లిప్ లు పంపిణీ చేయాలని, వాటిని సిద్ధం చేసి ఉంచాలని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి సి.యం.సాయికాంత్ వర్మ ఆదేశించారు. ఎన్నికల నోడల్ అధికారులతో కలెక్టర్ కార్యాలయంలో గురువారం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి సి.యం.సాయికాంత్ వర్మ, సాధారణ పరిశీలకులు వీరబ్రహ్మయ్య, వ్యయ పరిశీలకులు నందిని సలారియా, గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ కె.మయూర్ అశోక్, పోలీస్ సూపరింటెండెంట్ వకుల్ జిందాల్, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపాలిటీలలో డీ లిమిటేషన్ వలన కొంత మంది ఓటర్లు ఓటు హక్కు ఎక్కడ ఉందో సందిగ్ధావస్థలో ఉన్నట్లు రాజకీయ పార్టీల ప్రతినిధులు తెలియజేసారని, ఇందుకుగాను క్యూ ఆర్ కోడ్ బ్యానర్లు, పోస్టర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. జెడ్.పీ.టీ.సీ, ఎం.పీ.టీ.సీ ఎన్నికలకు శుక్రవారం ఎక్కువ నామినేషన్లు వచ్చే అవకాశం ఉందని, అందుకు రిటర్నింగ్ అధికారులు ముందస్తు అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. హెల్ప్ డెస్క్ మరింత క్రియాశీలంగా పనిచేయాలని ఆదేశించారు. తర్ఫీదు పొందిన సిబ్బందిని వినియోగించాలని అన్నారు. వంద మీటర్ల దూరం విధిగాపాటించాలని పేర్కొన్నారు. నిర్ణీత సమయంలో వచ్చే వారికి టోకెన్ లు జారీ చేయాలని సూచించారు. నామినేషన్లు పూర్తి జరిగిన వెంటనే స్క్రూటినీకి సిద్ధం కావాలన్నారు. రెండు దశల్లో గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు.

**శుక్రవారం పి.ఓలు, ఏ.పి.ఓలు శిక్షణ**

జెడ్.పీ.టీ.సీ, ఎం.పీ.టీ.సీ ఎన్నికలకు సంబంధించి పి.ఓలు, ఏ.పి.ఓలకు మొదటి శిక్షణ కార్యక్రమం శుక్రవారం ప్రారంభం అవుతుందన్నారు. ప్రతీ ఒక్కరూ శిక్షణకు హాజరు కావాలని స్పష్టం చేశారు. శిక్షణకు హాజరుకాని సిబ్బందికి షో కాజ్ నోటీస్ జారీ చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు.




**24, 25న పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటెషన్ కేంద్రాలు**

ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, సూచనల మేరకు, పోస్టల్ బ్యాలెట్ జారీ చేయుటకు 24, 25వ తేదీలలో పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటెషన్ కేంద్రం ఏర్పాటుకు సిద్ధంగా ఉండాలని తెనాలి మున్సిపల్ కమిషనర్ కు ఆదేశించారు.సాధారణ పరిశీలకులు వీరబ్రహ్మయ్య మాట్లాడుతూ ఓటరు స్లిప్ పంపిణీపై దృష్టి సారించాలని అన్నారు. శత శాతం పంపిణీ జరుగుటకు శ్రద్ధ వహించాలని సూచించారు. పోలింగ్ కేంద్రంలో అన్ని వసతులు ఏర్పాటు చేయాలని అన్నారు. వ్యయ పరిశీలకులు నందిని సలారియా మాట్లాడుతూ అభ్యర్థుల వ్యయాల నమోదు కచ్చితంగా జరగాలని అన్నారు. పోలీస్ సూపరింటెండెంట్ వకుల్ జిందాల్ మాట్లాడుతూ అనుమతులు లేకుండా ర్యాలీలు, సమావేశాలు జరగరాదని, ఎన్నికల ప్రవర్తన నియమావళి స్పష్టంగా అమలు చేయాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి, అదనపు ఎస్పీ జి.వి.రమణ మూర్తి, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వి.జ్యోతి బసు, జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగ సాయి కుమార్,రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీనివాస రావు, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

# గుంటూరు పశ్చిమంలో లక్ష్మీ అపర్ణకు జన నీరాజనం.. కదం తొక్కిన కూటమి శ్రేణులు!

**మేయర్ అభ్యర్థికి మద్దతుగా కదం తొక్కిన కూటమి శ్రేణులు!**
**గుంటూరు పశ్చిమంలో కోవెలమూడి లక్ష్మీ అపర్ణకు ప్రజా బ్రహ్మరథం**
**ఎమ్మెల్యే గల్లా మాధవి ఆధ్వర్యంలో హోరెత్తిన ఎన్నికల ప్రచారం.. రోడ్‌షోకు పోటెత్తిన మహిళలు, యువత, ప్రజలు!**





**గుంటూరు, రాజధాని వాయిస్** గుంటూరు నగర మేయర్ పదవికి కూటమి బలపరిచిన అభ్యర్థి కోవెలమూడి లక్ష్మీ అపర్ణకు మద్దతుగా గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో కూటమి శ్రేణులు కదం తొక్కాయి. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎమ్మెల్యే, తెలుగు దేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యురాలు గల్లా మాధవి ఆధ్వర్యంలో నిర్వహించిన రోడ్‌షోకు ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. మహిళలు, యువత, విద్యార్థులు, టీడీపీ కార్యకర్తలు, కూటమి నాయకులు ఉత్సాహంగా పాల్గొనడంతో ప్రధాన వీధుల్లో ఎన్నికల సందడి నెలకొంది.

**ప్రజల మధ్యకు మేయర్ అభ్యర్థి.. అడుగడుగునా ఆత్మీయ స్వాగతం!**

గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో సాగిన రోడ్‌షోలో కోవెలమూడి లక్ష్మీ అపర్ణకు స్థానికులు ఆత్మీయ స్వాగతం పలికారు. కూటమి అభ్యర్థికి మద్దతుగా నాయకులు, కార్యకర్తలు నినాదాలు చేస్తూ ప్రచారాన్ని ముందుకు తీసుకెళ్లారు. డివిజన్ల వారీగా పార్టీ శ్రేణులు సమన్వయంతో పాల్గొనడంతో ప్రచారానికి మరింత ఊపు వచ్చింది. కార్పొరేటర్ అభ్యర్థులు, డివిజన్ అధ్యక్షులు, స్థానిక నాయకులు, కూటమి ముఖ్య నాయకులు రోడ్‌షోలో భాగస్వాములయ్యారు.

**కదం తొక్కిన మహిళలు.. యువతలో ఉత్సాహం!**

రోడ్‌షోలో మహిళల భాగస్వామ్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పెద్ద సంఖ్యలో మహిళలు తరలివచ్చి లక్ష్మీ అపర్ణకు తమ మద్దతు తెలిపారు. యువత, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనగా, టీడీపీ కార్యకర్తలు, కూటమి అభిమానులు నాయకులతో కలిసి అడుగులో అడుగు వేశారు. ప్రజల స్పందనతో ప్రచారం సాగిన ప్రాంతాల్లో సందడి నెలకొంది. కూటమి అభ్యర్థి విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు సమష్టిగా ప్రచారాన్ని విస్తృతం చేశాయి.

**దేవాలయాలు, మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు**

ఎన్నికల ప్రచారంలో భాగంగా నాయకులు పలు దేవాలయాలు, మసీదులను సందర్శించి ప్రార్థనలు చేశారు. ప్రజల శ్రేయస్సు, గుంటూరు నగర అభివృద్ధిని ఆకాంక్షిస్తూ ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం కొనసాగిన రోడ్‌షోలో స్థానికులు, పార్టీ శ్రేణులు పెద్దఎత్తున పాల్గొని మేయర్ అభ్యర్థికి సంఘీభావం తెలిపారు.

**కూటమి నేతల సమష్టి ప్రచారం**

ఎమ్మెల్యే గల్లా మాధవితో పాటు కూటమి కార్పొరేటర్ అభ్యర్థులు, డివిజన్ అధ్యక్షులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కూటమి భాగస్వామ్య పక్షాల నేతలు, స్థానిక నాయకులు ప్రచారంలో పాల్గొన్నారు. కూటమి అభ్యర్థికి మద్దతుగా నాయకులంతా సమష్టిగా ప్రచారంలో పాల్గొనడంతో కార్యక్రమానికి రాజకీయ ప్రాధాన్యం సంతరించుకుంది.ఈ రోడ్‌షోలో కూటమి కార్పొరేటర్ అభ్యర్థులు షేక్ షర్మిల, షేక్ షాజహాన్, ఉల్లి గోపాలకృష్ణ, కావటి విక్రమ్ నాయుడు, బోనబోయిన సుజాత, కుంచపు త్రిపుర వాసవి, గంటా మౌళిక, తుమ్మల నాగమల్లేశ్వరి, చెన్నం వెంకట సీతయ్య, గాలం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.మొత్తంగా గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో కోవెలమూడి లక్ష్మీ అపర్ణకు మద్దతుగా నిర్వహించిన రోడ్‌షో కూటమి శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపింది. మహిళలు, యువత, కార్యకర్తలు, స్థానిక ప్రజల భాగస్వామ్యంతో ఎన్నికల ప్రచారం సందడిగా సాగింది. మేయర్ అభ్యర్థి విజయమే లక్ష్యంగా కూటమి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ప్రచారాన్ని ఉధృతం చేశారు.

## జడ్పీటీసీ టీడీపీ అభ్యర్థిగా డాక్టర్ కొండపల్లి శివ కుమారి నామినేషన్ దాఖలు



**కారంపూడి.అక్టోబర్ 22 రాజదాని వాయిస్ :** మండలం జడ్పీటీసీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా డాక్టర్ కొండపల్లి శివకుమారి గురువారం నామినేషన్ దాఖలు చేశారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఆమె నామినేషన్ పత్రాలను అధికారులకు సమర్పించారు.ఈ సందర్భంగా నామినేషన్ ప్రక్రియకు సహకరించిన మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి, ఎంపీ లావుకు కూటమి ప్రభుత్వానికి డాక్టర్ కొండపల్లి శివకుమారి ధన్యవాదాలు తెలిపారు.

## కారంపూడిలో హోరెత్తిన నామినేషన్ హంగామా

### కారంపూడి ఎంపీటీసీ 1 తండా మస్తాన్ జానీ నామినేషన్ దాఖలు

**కారంపూడి అక్టోబర్ 22రాజదాని వాయిస్ :** మండల కేంద్రమైన కారంపూడి లోని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీటీసీ నామినేషన్లు దాఖలు చేశారు. కారంపూడి ఎంపీటీసీ 1 గా తండా మస్తాన్ జానీ టిడిపి అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. స్థానిక నాయకులు కార్యకర్తలు అభిమానులు తరలిరావడంతో నామినేషన్ కార్యక్రమం సందడిగా మారింది. అనంతరం నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ ఆఫీసర్ కు అందజేశారు. ఈ సందర్భంగా మస్తాన్ జానీ మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో నారా లోకేష్ స్ఫూర్తితో అభివృద్ధి నా లక్ష్యం అని గతంలో ఏ ప్రభుత్వాలు చేయని అభివృద్ధిని చేసి చూపిస్తా అని వారు అన్నారు. టిడిపి శ్రేణులు మస్తాన్ జానీ కు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ



ముఖ్య నాయకులు మాజీ ప్రజా ప్రతినిధులు గ్రామ పెద్దలు యువకులు టిడిపి పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## జిల్లా లో ప్రశాంత వాతావరణంలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ కలెక్టర్ కృతిక శుక్ల

**నరసరావుపేట, అక్టోబర్ 22 రాజధాని వాయిస్ :** పల్నాడు జిల్లాలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో కొనసాగుతోందని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి కృతిక శుక్ల తెలిపారు. గురువారం జిల్లా అదనపు ఎస్పీ రోహిత్ చౌదరి మరియు జడ్పీటీసీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి సంజన శ్రీహర్ష తో కలిసి స్థానిక రెవిన్యూ డివిజన్ కార్యాలయంలో జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి జరుగుతున్న నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో రాజకీయ పార్టీల అభ్యర్థులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంత వాతావరణంలో నామినేషన్లు దాఖలు చేసుకునేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఈ నెల 21వ తేదీ నుంచి జిల్లా పరిషత్, మండల పరిషత్ ఎన్నికలకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైందని, రెండో రోజు కూడా ప్రశాంతంగా కొనసాగుతోందని పేర్కొన్నారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు నామినేషన్లు దాఖలు చేసేందుకు



అవసరమైన సదుపాయాలు కల్పించామని తెలిపారు.జిల్లాలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోలేదని కలెక్టర్ వెల్లడించారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా, పారదర్శకంగా జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపారు.

## కారంపూడి మండలంలో 20 నామినేషన్ల నమోదు

కారంపూడి.అక్టోబర్ 22రాజదాని వాయిస్ :మండలంలో ఎంపీటీసీ నామినేషన్ల ప్రక్రియ రెండో రోజు ముగిసింది. మండలంలో మొత్తం 15 ఎంపీటీసీ స్థానాలు ఉండగా, రెండు రోజుల్లో కలిపి 20 నామినేషన్లు నమోదయ్యాయని అధికారులు తెలిపారు.మొదటి రోజైన బుధవారం 2 నామినేషన్లు నమోదు కాగా, రెండో రోజైన గురువారం ఒక్కరోజే 18 నామినేషన్లు దాఖలయ్యాయి.

## మాతృ, శిశు మరణాల రేటును సున్నాకు తేవడమే లక్ష్యం: కలెక్టర్!

**విజయవాడ రాజధాని వాయిస్** జిల్లాలో మాతృ, శిశు మరణాలను పూర్తిస్థాయిలో నివారించడమే లక్ష్యంగా వైద్యారోగ్య శాఖ అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ ఆదేశించారు. ప్రతి శిశు, మాతృ మరణం సంబంధిత కుటుంబానికి తీరని లోటని, ఇటువంటి విషాదకర ఘటనలు పునరావృతం కాకుండా ప్రతి మరణానికి గల కారణాలను లోతుగా విశ్లేషించి, నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు.విజయవాడ కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరం నందు గురువారం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించిన మాతృ, శిశు మరణాల జిల్లా స్థాయి కమిటీ సమీక్ష సమావేశంలో ఈ ఏడాది ఏప్రిల్‌లో రెండు, మే నెలలో ఒకటి, జూన్ నెలలో ఒకటి చొప్పున నమోదైన మొత్తం నాలుగు శిశు మరణాలు, అలాగే ఆగస్టులో ఒకటి, సెప్టెంబర్‌లో రెండు చొప్పున నమోదైన మొత్తం మూడు మాతృ మరణాలపై సమీక్ష నిర్వహించారు.సంబంధిత ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వారీగా కేసులను పరిశీలించి, ప్రతి మరణానికి దారితీసిన వైద్యపరమైన, క్షేత్రస్థాయి కారణాలపై వైద్యాధికారులు, సంబంధిత ఆరోగ్య సిబ్బందితో జిల్లా కలెక్టర్ సమగ్రంగా చర్చించారు. మరణాల విశ్లేషణలో భాగంగా గర్భిణులకు అందించిన వైద్య సేవలు, ప్రసవ సమయంలో తీసుకున్న జాగ్రత్తలు, ప్రసవానంతర సంరక్షణ, శిశువుల ఆరోగ్య పరిస్థితి, పోషకాహారం,టీకాల అమలు, అత్యవసర వైద్య సేవలు, రిఫరల్ వ్యవస్థ తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించారు. సంబంధిత ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, పర్యవేక్షకులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ కార్యకర్తలతో కేసుల వారీగా సమీక్షించి, భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ మాట్లాడుతూ, మాతృ, శిశు మరణాల నివారణకు ముందస్తు గుర్తింపు, నిరంతర పర్యవేక్షణ, సకాలంలో వైద్య చికిత్స అత్యంత కీలకమని పేర్కొన్నారు. ముఖ్యంగా అధిక ప్రమాద గర్భిణులను ముందుగానే గుర్తించి, వారికి అవసరమైన ప్రత్యేక వైద్య పర్యవేక్షణ అందించాలని ఆదేశించారు.క్షేత్రస్థాయిలో పనిచేసే ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు గర్భిణుల ఆరోగ్య పరిస్థితి ని క్రమం తప్పకుండా పర్యవేక్షిస్తూ, అవసరమైన వైద్య పరీక్షలు, మందులు, పౌష్టికాహారం సకాలంలో అందేలా చర్యలు తీసుకోవా లని సూచించారు.ప్రసవ సమయానికి ముందుగానే తగిన ఏర్పాట్లు చేసుకోవాలని, అత్యవసర పరిస్థితుల్లో గర్భిణులను మెరుగైన వైద్య సేవలు అందించే పెద్దాసుపత్రులకు తరలించేం దుకు అవసరమైన రవాణా సదుపాయాలను సిద్ధంగా ఉంచుకో వాలని తెలిపారు. అదేవిధంగా అవసరమైన రక్త నిల్వలు, అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉండేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.గర్భిణులకు సమయానుకూల వైద్య పరీక్షలు



నిర్వహించడం, సురక్షిత ప్రసవాలను నిర్ధారించడం, జననం అనంతరం శిశువులకు తగిన సంరక్షణ అందించడం, పోషకాహారంపై దృష్టి సారించడం, నిర్ణీత షెడ్యూల్ ప్రకారం టీకాలు వేయించడం వంటి అంశాల్లో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వ రాదని స్పష్టం చేశారు.మాతృ, శిశు మరణాల నివారణ అనేది వైద్యారోగ్య శాఖకే పరిమితమైన బాధ్యత కాదని, సంబంధిత శాఖల అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతి కేసులో గుర్తించిన లోపాలను సరిదిద్దడంతో పాటు, సంబంధిత ప్రాంతాల్లో ఆరోగ్య సేవలను మరింత మెరుగుపరచాలని ఆదేశించారు.జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎ. శ్రవణ్ బాబు మాట్లాడుతూ, శిశు ఆరోగ్యం, తల్లుల ఆరోగ్య సంరక్షణపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో ఆరోగ్య సేవల నాణ్యతను పెంపొందించడం, గర్భిణులు మరియు శిశువులకు నిరంతర వైద్య పర్యవేక్షణ అందించడం ద్వారా మాతృ, శిశు మరణాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. ఇందుకోసం వైద్య సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు.జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్ ఓ.మాధవి లత మాట్లాడుతూ, అత్యవసర పరిస్థితుల్లో గర్భిణులు, శిశువులను సరైన సమయంలో మెరుగైన వైద్య సేవలు అందించే ఆసుపత్రులకు తరలించేందుకు రిఫరల్ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉన్నత స్థాయి ఆసుపత్రుల మధ్య సమన్వయం మెరుగుపరచడం ద్వారా సకాలంలో వైద్య సేవలు అందించవచ్చని పేర్కొన్నారు.జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ఎం.శరత్ బాబు మాట్లాడుతూ, శిశువుల ఆరోగ్య పరిరక్షణలో టీకాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ప్రతి శిశువుకు నిర్ణీత వయస్సులో పూర్తి టీకాలు అందేలా చర్యలు తీసుకోవాలని, టీకాలు వేయించుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు.

## ఎన్నికల ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలి: కలెక్టర్ లక్ష్మీశ!

**తిరువూరు, రాజధాని వాయిస్ :** మున్సిపల్, స్థానిక సంస్థల ఎన్నికలను పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన అన్ని ముందస్తు ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ సంబంధిత అధికారులను ఆదేశించారు.తిరువూరు మున్సిపల్ పరిధిలోని పలు పోలింగ్ స్టేషన్లు, స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ కేంద్రాలను గురువారం జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి క్షేత్రస్థాయి ఏర్పాట్లను నిశితంగా పరిశీలించారు. తొలుత తిరువూరు స్థానిక జడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్లను కలెక్టర్ పరిశీలించారు.ఓటర్లు తమ పోలింగ్ కేంద్రాలను సులభంగా గుర్తించే విధంగా ప్రతి బూత్ వద్ద స్పష్టమైన సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. తాగునీరు, విద్యుత్, దివ్యాంగులకు ర్యాంపుల వంటి కనీస మౌలిక వసతుల్లో ఎక్కడా లోపాలు తలెత్తకుండా చూడాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని, శాంతిభద్రతల పరిరక్షణకు అధిక ప్రాధాన్యమివ్వాలని స్పష్టం చేశారు.అనంతరం తిరువూరు శ్రీ వాహిని ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఇంజనీరింగ్ కళాశాలలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి ఏర్పాటు చేస్తున్న స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ కేంద్రాలను కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్ట్రాంగ్ రూముల భద్రత అత్యంత కీలకమని, కిటికీలను తాత్కాలికంగా చెక్కలతో కాకుండా పూర్తిగా ఇటుకలు, సిమెంట్ గోడలతో మూసివేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.కౌంటింగ్ కేంద్రాలకు వచ్చే సిబ్బందికి, రాజకీయ పార్టీల ఏజెంట్లకు, ప్రజలకు ఎలాంటి గందరగోళం లేకుండా వేర్వేరు ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి విభాగం వద్ద ఎవరికి కేటాయించిన మార్గమో తెలిపేలా భారీ సైన్ బోర్డులు తప్పనిసరిగా ఉండాలని ఆదేశించారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు, పోలింగ్ సిబ్బందికి విధివిధానాలపై పూర్తిస్థాయి సమగ్ర శిక్షణ ఇవ్వాలని ఆర్డీవో, మున్సిపల్ కమిషనర్, ఎంపీడీవోలను కలెక్టర్ ఆదేశించారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘనలకు తావులేకుండా కట్టుదిట్టమైన నిఘా ఉంచాలని హెచ్చరించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులకు, అభ్యర్థులకు ఎన్నికల నిబంధనలపై అవగాహన కల్పించాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో, నిర్దేశిత గడువులోగా ఎన్నికల ఏర్పాట్లన్నీ పూర్తి చేసి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి, ప్రజాస్వామ్య పండుగలాంటి ఈ ఎన్నికలు ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా జరిగేలా తిరువూరు ప్రజలు పూర్తి సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ కోరారు.ఈ తనిఖీ కార్యక్రమంలో స్థానిక తిరువూరు రెవెన్యూ డివిజనల్ అధికారి ఎ.కుమార్, మున్సిపల్ కమిషనర్ మనోజ్ఞ, తహసిల్దార్ డి.చంద్రమౌళి, ఎంపీడీవో సిహెచ్ రవిబాబు, తిరువూరు ఎస్.ఐ శాతకర్ణి, సర్వే శాఖ అధికారులు, ఇంజనీరింగ్ విభాగం అధికారులు, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## కార్తిక మాస రద్దీకి పక్కా ఏర్పాట్లు: ఈవో శ్రీనివాసరావు!

**శ్రీశైలం, రాజధాని వాయిస్ :** ఈ రోజు సాయంత్రం కార్యనిర్వహణాధికారి యం. శ్రీనిసవారావు సర్వదర్శనం,శీఘ్రదర్శనం, అతిశీఘ్రదర్శనం క్యూలైన్లు, ఆలయ ప్రాంగణంలోని దర్శనం క్యూలైన్లు, క్యూకాంప్లెక్సు కంపార్టుమెంట్లను మొదలైనవాటిని పరిశీలించారు. అదేవిధంగా అన్నప్రసాదవితరణ భవన సముదాయం, లడ్డుప్రసాదాల విక్రయకేంద్రాల క్యూలైన్లను పరిశీలించారు.ముఖ్యంగా ఆయా క్యూలైన్లలో ఏర్పాటు చేసిన సి.సి. కెమెరాల అమరికను ప్రత్యేకంగా కార్యనిర్వహణాధికారివారు పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోవు కార్తికమాసంలో భక్తులరద్దీ అధికంగా ఉంటుందన్నారు. రోజువారి గాను మరియు రద్దీ సమయంలో కమాండ్ కంట్రోల్ రూము నుండి సంబంధిత అధికారులు క్యూలైన్లను ఎప్పటికప్పుడు పరిశీలిస్తుండాలన్నారు. ముఖ్యంగా కమాండ్ కంట్రోల్ రూము అధికారులు పరిస్థితులను బేరీజు వేసుకుంటూ సంబంధిత అధికారుల సమన్వయంతో క్యూలైన్ల నిర్వహణకు తోడ్పడాలన్నారు. క్యూ లైన్లలో ఎటువంటి తొక్కిసలాట జరుగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా సంబంధిత సిబ్బంది ఎప్పటికప్పుడు అధికారులతో మాట్లాడుతూ దర్శనం క్యూలైన్లను నిర్వహిస్తుండాలన్నారు.ఇంకా వారు మాట్లాడుతూ ముఖ్యంగా సర్వదర్శనం క్యూలైన్లలోని సాధారణ భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం కల్పించేందుకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. భక్తుల రద్దీ సమయంలో ముఖ్యంగా వారాంతపు సెలవులు పర్వదినాలలో క్యూ లైన్ల నిర్వహణ పట్ల మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.అదేవిధంగా దర్శనము వేళలు, దర్శనాలకు పట్టే సమయం మొదలైన అంశాలను నిరంతరం ఆలయ ప్రసార వ్యవస్థ ద్వారా ప్రసారం చేస్తుండాలన్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు క్యూ లైన్లలో ఎటువంటి అంతరాయం లేంకుడా మంచినీరు, అల్పాహారం అందిస్తుండాలని అధికారుకు సూచించారు.అన్నీ క్యూ లైన్లలోని మరియు క్యూకాంప్లెక్స్ కంపార్టుమెంట్లలోని లైట్లు, ఫాన్లు, సజావుగా పనిచేసే విధంగా సంబంధించిన సిబ్బంది పర్యవేక్షిస్తుండాలన్నారు. అదేవిధంగా ఎలక్ట్రికల్ వైరింగులకు ఎప్పటికప్పుడు అవసరమైన తగు మరమత్తులు చేస్తుండాలన్నారు. అన్నీ క్యూలైన్లలోన ఫ్లోరింగులను పరిశీలించి అవసరమైనచోట్ల వెంటనే తగు మరమ్మతులు, ప్యాచ్ వర్కులు చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.తరువాత లడ్డుప్రసాదాల విక్రయకేంద్రాలను పరిశీలించారు. భక్తులు అధిక సమయం వేచివుండకుండా వుండేవిధంగా లడ్డు ప్రసాదాలను అందజేస్తుండాలన్నారు. రాబోవు కార్తికమాసములో అదనపు ప్రసాదాల విక్రయకేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. మహిళలకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు ఉండాలని అధికారులను అదేశించారు.అనంతరం అన్నప్రసాదవితరణను పరిశీలించారు. కార్తికమాసంలో భక్తులరద్దీకనుగుణంగా అన్నప్రసాదవితరణ ఉండాలన్నారు. ప్రతీరోజు కూడా ఎటువంటి కాలతీతం లేకుండా భక్తులకు అన్నప్రసాదవితరణను ప్రారంభించాలన్నారు. భక్తుల సంఖ్యను బట్టి మధ్యాహ్నం గం. 3.30 వరకు కూడా అన్నప్రసాద వితరణ ఉండాలన్నారు. అదేవిధంగా అన్నప్రసాద వితరణ భవనంలో రాత్రివేళలో రాత్రి గం. 7.00ల నుంచే అల్పాహార వితరణను ప్రారంభించాలన్నారు. ఈ పరిశీలనలో ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## చిలకలూరిపేటలో 'రెడ్‌బుక్' ఎన్నికలు: విడదల రజిని

### నామినేషన్ల ఉపసంహరణపై తీవ్ర ఆరోపణలు.. ఎస్ఈసీ చర్యలు తీసుకోకపోతే హైకోర్టు, సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని హెచ్చరిక

**చిలకలూరిపేట, రాజధాని వాయిస్** చిలకలూరిపేట నియోజకవర్గంలో స్థానిక సంస్థల ఎన్నికలు స్వేచ్ఛగా, పారదర్శకంగా జరగడం లేదని మాజీ మంత్రి, వైఎస్సార్సీపీ నేత విడదల రజిని ఆరోపించారు. టీడీపీ అక్రమాలు, దాడులు, బెదిరింపులపై రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. గురువారం చిలకలూరిపేటలోని తన నివాసంలో ఆమె మీడియాతో మాట్లాడారు.ప్రస్తుత ఎన్నికలు సాధారణ స్థానిక ఎన్నికలు కావని, 'రెడ్‌బుక్ ఎన్నికలు'గా మారాయని రజిని విమర్శించారు. వైఎస్సార్సీపీ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయకుండా అడ్డుకోవడం, అభ్యర్థులు, వారి కుటుంబ సభ్యులను బెదిరించడం, దాడులకు పాల్పడటం జరుగుతోందని ఆరోపించారు. పోలీసుల సమక్షంలోనే ఈ ఘటనలు చోటుచేసుకుంటున్నా అధికారులు తగిన చర్యలు తీసుకోవడం లేదని అన్నారు.

**అర్ధరాత్రి వరకు ఉపసంహరణలేంటి?**

మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ రాష్ట్రవ్యాప్తంగా మధ్యాహ్నం 3 గంటలకు ముగియాల్సి ఉండగా.. చిలకలూరిపేటలో మాత్రం అర్ధరాత్రి 12 గంటల వరకు కొనసాగిందని రజిని ఆరోపించారు. రాత్రి 10 గంటలకు ఎన్నికల ప్రక్రియను వాయిదా వేస్తున్నట్లు ఎస్ఈసీ ప్రకటించినప్పటికీ, ఆ తర్వాత కూడా ఉపసంహరణలు కొనసాగించారని అన్నారు. అభ్యర్థులను బెదిరించి, దాడులు చేసి, ఆస్తులు ధ్వంసం చేస్తామని హెచ్చరించి నామినేషన్లు ఉపసంహరించుకునేలా చేశారని ఆరోపించారు. ఒక మహిళా అభ్యర్థిని రాత్రివేళ ఇంటి నుంచి తీసుకొచ్చి నామినేషన్ ఉపసంహరించుకునేలా చేశారని పేర్కొన్నారు.

**సీసీటీవీ ఫుటేజ్ బయటపెట్టాలి**

చిలకలూరిపేటలో మధ్యాహ్నం 3 గంటల నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు నమోదైన సీసీటీవీ ఫుటేజ్‌ను బయటపెట్టాలని రజిని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంపై ఎస్ఈసీకి ఆధారాలు, వీడియోలను సమర్పించినట్లు తెలిపారు. ఫుటేజ్‌ను భద్రపరచాలని కోరినట్లు చెప్పారు.

నాదెండ్ల, ఎడ్లపాడు మండలాల్లో వైఎస్సార్సీపీ అభ్యర్థులు, నాయకులను నామినేషన్లు వేయకుండా అడ్డుకున్నారని, కొందరిని పోలీస్ స్టేషన్లకు తరలించారని ఆరోపించారు. మహిళలు సైతం



నామినేషన్లు వేసేందుకు నిరసనలకు దిగాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు.**ఎన్నికలు రీషెడ్యూల్ చేయాలి**

చిలకలూరిపేట మున్సిపల్ ఎన్నికలను రీషెడ్యూల్ చేయాలని ఎస్ఈసీని కోరినట్లు రజిని తెలిపారు. ఫిర్యాదుపై తగిన చర్యలు తీసుకోకపోతే హైకోర్టును, అవసరమైతే సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని స్పష్టం చేశారు. ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకునే వరకు పోరాటం కొనసాగిస్తామని అన్నారు."ధైర్యం, నిజాయితీ ఉంటే ప్రజల్లోకి వచ్చి ఎన్నికల్లో పోటీ చేయాలి. ప్రజలే ఎవరు గెలవాలో నిర్ణయిస్తారు. సాంకేతికంగా ఎవరు గెలిచినా.. నైతికంగా వైఎస్సార్సీపీదే విజయం" అని విడదల రజిని పేర్కొన్నారు.

PRINTED, PUBLISHED AND OWNED BY PAGALA PURNA CHANDRA RAO. MUTUKURU (POST) DURGI MANDAL MACHERLA CONSTITUENCY. PALNADU DISTRICT.AP.DOOR N0 0-004 PINCODE 522612 PHONE NUMBER 9030343195. PRINTED AT SRI KANAKA BHARGAV OFF-SET PRINTERS. MAIN ROAD ANJANEYA COLONY REDDYPALEM GUNTUR 522009 ANDHRA PRADESH . EDITOR :PAGALA PURNA CHANDRA RAO
RNI NO :APTEL/2023/90201PHONE NUMBER : 9030343195.EMAIL. rajadhanivoicedaily@gmail.com